


అన్ని పక్కల నుంచీ చీకట్లు చిక్కగా కమ్ముకొచ్చే వేళకు గదికి తాళంవేసి మెట్లు దిగి అక్కడకు చేరుకోవటం నాకు చాలా కాలంనుంచీ ఉన్న అలవాటు. ఒక్కోసారి చీకట్లు కమ్ముకోవటం అనేదైనా కొంచెం ఆలస్యం కావచ్చు కానీ నా దిన చర్యలో ఆ ఆలస్యం ప్రతిఫలించదు. వేళంటే వేళే! అలవాటంటే అలవాటే మరి!

ఈ అలవాటు నాదొక్కడిదే అయి ఉంటే బాగుండేది. ఈ అలవాటు ఇంకా ఎంతమందిలో ఉందో నాకు సరిగ్గా తెలీదు కానీ, ఖచ్చితంగా మరో ముగ్గురు నేను అక్కడికి చేరే వేళకు చేరుకొంటారు.

అక్కడ – మా కూడలికి కేంద్ర స్థలంగా ఉన్నది ఒక చిన్న మిరపకాయల బజ్జీ కొట్టు. కొట్టు చిన్నదే కానీ అక్కడే మిరపకాయలు మాత్రం ఏనుగు తలకాయ సైజులో ఉంటాయి.

రుచిలోనూ అంతే - బహుశా ఆంధ్రదేశం ఈ మూల నుంచీ ఆ మూల వరకూ అంత రుచైనవి దొరకవనుకొంటాను.

చిన్న చింత చెట్టూ, కమ్ముకొంటున్న, లేకపోతే కమ్మేసిన చీకట్లు. ఆ చీకట్ల చెట్టు నీడలో చిన్న నాలుగు చక్రాల బండి. దాని మీద ఒక రాక్షసి బొగ్గు కుంపటి, కుంపట్లోంచి నాలుగు పక్కలకూ నాల్కలు చాపుతూ చీకట్ల మీద కత్తులు దూస్తున్నట్లుగా అగ్ని జ్వాలలు. పైన, ఆ కణకణలాడే నిప్పులకు సాటిగా కాగుతున్న నూనె. దానిలో వేగుతున్న మిర్చి బజ్జీలు - ఒక్కసారి ఊహించుకొటేనే చాలు, నోరూరుతోంది నాకు.

పైగా ఒకసారి రుచి చూసిన వాళ్ళు ఎవ్వరూ 'ఆ మత్తు మందు' వల్లోంచి బయటకు పోలేరు.

మత్తు అంతా ఆ మిర్చిలోనే ఉందో, ఆ వాతావరణంలోనే ఉందో, మా అలవాటులో ఉందో - ఇవేవీ కాకపోతే ఆ మిర్చి వేయించే గురుస్వామి భార్య మాణిక్యంలో ఉందో తెలీదు. మాణిక్యం - నిజంగా మట్టిలోంచి తీసిన మాణిక్యంలా ఉంటుంది. ఇంకా కడగనట్లుగా అక్కడక్కడ ఆమె ముఖంలో కొంచెం అలసట. పనిలో నిమగ్నమయి ఉండటం వల్ల కాబోలు, ఎప్పుడూ సరిగా ఉండని ఆమె పైటలోంచి మేము రుచి చూడాలనుకొన్నా చూడలేని ఆ అందాలు.. ఆ పరిస్థితుల్లోంచి, ఆ అలవాటులోంచి నాకు విమోచనం వద్దంటే వద్దు.

బహుశా మిగతా ముగ్గురూ అలాగే అనుకొంటారు కాబోలు. ఎందుకు అంటే నా అలవాటే వారిదీ అయినప్పుడు నా ఆలోచన వాళ్ళలోనూ ఉండి ఉండచ్చు.

నేను - మందుల కంపెనీలో ఆపరేటర్‌గా చేరి ఆరేళ్ళు దాటింది. ఇప్పుడు మేము ఉంటున్న కాలనీ ఇంకా రూపం దిద్దుకోకమునుపే నేను ఆ కంపెనీలో చేరాను. కాలనీ రూపం మారిపోయింది. యాభైమందిలో ఒకడిగా చేరిన నేను ఈనాడు నాలుగువేలమందిలో ఒకణ్ణి అయ్యాను. అంతే, అంతకుమించి మార్పేమీ లేదు. ఏడాదికి ఒకసారి ఇంక్రిమెంటు అంటూ పదిరూపాయల జీతం పెరిగితే, గొడవేమీ లేకుండానే వచ్చేసిందికదా అనే తృప్తి అప్పుడప్పుడు ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

ఇక మిగిలిన ఆ ఖాతాదార్ల ఆ సంఘ సభ్యులు - యాదగిరి, వీరేశం, పాషా.

యాదగిరి బహుశా అక్కడే ఉండే నూలు మిల్లులో ఉండవచ్చు. అప్పుడప్పుడూ తలపైన ఇంకా తుడుచుకోని పత్తి కనిపిస్తూనే ఉంటుంది.

పాషా మా మందుల కంపెనీలో డ్రైవర్‌గా ఉంటున్నాడు. నేను చేరిన ఆర్నెల్లకు చేరిన అతనికి అప్పుడు నాకన్నా అరవై రూపాయలు తక్కువ జీతం ఉండేది. ఇప్పుడతనికి నాకన్నా జీతంలో ఇరవై ఎక్కువ వస్తాయి. అతనిప్పుడు సెలక్షన్ గ్రేడు డ్రైవర్!! ఇష్టం ఉంటే, ఓవర్ టైం చేస్తే ఇంకా ఎక్కువ వస్తుంది. ఇదికాక పెట్రోల్ బంకూ, పాషాకు - మిగతా అందరూ డ్రైవర్లలాగానే ఉన్న ఒప్పందం ప్రకారం నెలకు కనీసం ఇంకో నూట ఇరవై వరకైనా చేతికి ఇస్తుందనేది అందరికీ తెలిసిన రహస్యం. ఇది గుర్తొచ్చినప్పుడు నాకు యూనివర్సిటీ వాళ్ళు ఇచ్చిన పట్టా చింపి అవతల పారేసి డ్రైవర్‌గా ఉద్యోగం వెతుక్కుంటే బాగుండుననిపిస్తుంది.

కానీ అలా చేయలేను. కారణాలు ఎన్నైనా, డ్రైవర్ ఉద్యోగం చాలా చిన్నదని ఎక్కువ మంది ఉద్దేశ్యం. పైగా పెట్రోలు బంకుల వాళ్ళతో ఒప్పందాలకు రాగలిగే నేర్పూ, చాకచక్యమూ-ఒకవేళ రాగలిగినా అది నా గొప్పగా పదిమందికి చెప్పుకోకుండా ఉండగలిగే ఓపికా నాకు లేవు. మొత్తానికి పాషాను చూసి ఈర్ష్యపడటం కూడా అలవాటయిపోయింది నాకు.

ఇక వీరేశం... మా కాలనీ కడుతున్నప్పుడు, ఒకసారి చూద్దామని వచ్చినపుడు ఇక్కడ-అంటే ఖచ్చితంగా ఈ చింత చెట్టుకు కొంచెం దూరంలో ఒక బోర్డు చూశా నేను. ఆ బోర్డుమీద 'దిస్ లాండ్ బిలాంగ్స్ టు...' అని కాకుండా 'గవర్నమెంట్ లాండ్' అని ఉండేది. ఆ స్థలం గవర్నమెంటుది కాకుండా ఎవరిదైనా ప్రైవేట్ వ్యక్తులది అయి ఉంటే... కొంటే... చాలా లాభం భవిష్యత్తులో ఉండి ఉంటుందనుకునే వాణ్ణి. నిజానికి అది ఎవరిదో ఒక వ్యక్తిదే అయినా కొనే ఆర్థిక స్థోమత నాకు లేనేలేదు. మా కాలనీలో గృహనిర్మాణం అయి, మేము చేరిపోయాక అక్కడ స్థలమంతా మారిపోయినా, చింత చెట్టు పరిసరాలు అలాగే ఉండేవి.

అదే చింత చెట్టు, అదే మిర్చికొట్టు. అదే గురుస్వామి, అదే మాణిక్యం - మాలోనూ అదే కోరిక, ఏదీ మారలేదు.

కానీ, ఒక ఏడాది తర్వాత, ఒక రోజున మామూలుగా మిర్చి కొనుక్కొవడానికి వెళ్ళినప్పుడు - అంతవరకు నాతో మాట్లాడని వీరేశం, చిన్న చిరునవ్వు నవ్వాడు. "రేపు మా గృహ ప్రవేశం! రండి, సార్!"

గృహప్రవేశం! ఎంత మందికి తీరగలిగే కోరిక అది! ఆశ్చర్యపోతూ అడిగాను "ఎక్కడ?"

"ఇక్కడే!" అన్నాడు వీరేశం నవ్వుతూ. చుట్టు చూసిన నాకు ఎక్కడా ఇల్లనేది కనబడలేదు. అయినా అతనితో మాట్లాడటం ఇష్టంలేక - నా స్టేటస్‌కు తక్కువగా ఫీలయి ఊరుకున్నాను.

మర్నాడు సాయంత్రం మాణిక్యం కొట్టుకు వెళ్లేసరికి, కొట్టు వెనుక వీరేశం ఇల్లు! నిజమే - నిన్న సాయంత్రం వరకూ లేనిది! ఈ రోజు ఆ గృహ ప్రవేశం అయిపోయింది. నాలుగు తడికెలు నాలుగు పక్కలా పెట్టి, పైన ఇంకో తడిక పెట్టాడు. ఇల్లు పూర్తయిపోయింది. కొత్త తడికలతో కొత్త మామిడి తోరణాలతో ఇల్లు కళకళలాడుతోంది.

కానీ, ఆ స్థలం ప్రభుత్వానిదని, అక్కడ అలా ఇల్లు కట్టుకోవడం నేరమనీ అతనికి తెలీదు. తెలిస్తే ఇలా చేసి ఉండేవాడు కాదు అనుకుంటూ ఆ బోర్డుకేసి చూశాను. గవర్నమెంట్ లాండ్ అని ఉన్న చోట పక్కన ఇంకో బోర్డ్ 'ఈ స్థలం గుడిసెల వాళ్లది. కొన్నచో కొన్నవారే బాధ్యులు!!' అని ఆశ్చర్యపోయాను.

ఒక పది రోజులు గడిచాక పాషా ఇంటి ముందు ఆటో రిక్షా ఒకటి నిలబడిఉంది. పాషా ఆ ఆటోకు ఏదో పూలదండ ఒకటి తగిలిస్తూ కనబడ్డాడు. అంటే కొత్తగా కొన్నాడన్నమాట.

నాలో ఈర్ష్య తలెత్తింది - వీరేశం కట్టిన ఇల్లు ఉంది. పాషా కొత్తగా ఆటో కొన్నాడు.

నేను - ఆరేళ్ల కిందట ఎలా ఉన్నానో నేడూ అంతే. భవిష్యత్తులోనూ అంతే అనుకుంటాను.

- ఇంకో వారం రోజులు గడిచేసరికి, చింతచెట్టు చిన్నబోయి కనబడింది. కారణం, ఎప్పుడూ అక్కడ ఉండే మాణిక్యం అక్కడ ఉండకపోవటమే! కళ్లారా చూసుకోగలిగే నాకు కరువే వచ్చింది. ఈ కరువుకూ ఒక కారణం ఉందని మరో రెండు రోజుల తర్వాత వీరేశం ఇంటి ముందున్న నులక మంచం మీద కూర్చుని వీరేశంతో ఏదో మాట్లాడుతూ నవ్వుల వెన్నెలలు కురిపిస్తున్న మాణిక్యాన్ని చూస్తే అర్థమయింది నాకు.

అసలే బాధపడుతున్న నాకు ఇది ఒకింత ఇబ్బందే అయింది. వీరేశం, నేనూ మాణిక్యం కొట్టుకు నిత్యం ఖాతాదార్లమే అయినా, మాణిక్యం వీరేశాన్నే కోరుకొంది. అంటే....?

ఇలా బాధపడుతున్న నాకు ఉపశమనంగా ఒక అయిదారు నెలలు తర్వాత వీరేశం తడికల ఇల్లు కూల్చివేయబడి కనబడింది. మనసంతా ఎంతో తేలికయి ఆ రోజు మరో రెండు మిర్చీలు అధికంగా తిని బయటి కొచ్చాను. కానీ నా సంతోషం పది కాలాలపాటు నిలువనేలేదు. వీరేశం తడికల ఇంటి స్థలం పునాదులు తవ్వి దాన్ని పెంకుటిల్లులా కూర్చే ప్రయత్నంలో ఉండటం చూసి గురుస్వామిని అడిగాను- "ప్రభుత్వ జాగా కదా అది. అక్కడ ఇల్లు కడితే పడగొట్టరూ?" అంటూ.

గురుస్వామి చెప్పింది విని షాక్ తిన్నాను. "ప్రభుత్వం ఆ జాగాలో ఉండే వాళ్ళకు పట్టా లిచ్చేసిందట."

కళ్ళు తిరిగిపోయినట్లయిపోయి ఇంటికి వస్తూంటే పాషా ఇంటి ముందు కొత్త టాక్సీ కనబడింది. దీని విషయం ఇంక నేనెవర్నీ అడగలేదు.

వీరేశం ప్రభుత్వం జాగాలో ఇల్లు కట్టుకున్నాడు. ప్రభుత్వం ఆ తర్వాత అతనికి పట్టా ఇచ్చేసింది.

వీరేశం గురుస్వామి కొట్లో మిర్చీలు కొనేవాడు. చివరకు మాణిక్యాన్నే సొంతం చేసుకున్నాడు.

మాణిక్యం భర్తచాటున అమ్మే మిర్చీలు వదిలేసి, భర్తను వదిలేసి, చింత చెట్టు నీడలోంచి పెంకుటింట్లోకి మారింది.

ప్రభుత్వాన్ని మోసం చేసి పాషా ఆటో కొన్నాడు. బహుశా ఆ టాక్సీకూడా కొనే ఉంటాడు.

నాలో ఎక్కడ ఉంది లోపం?

నేను ఆరేళ్ళ క్రితం ఎక్కడ, ఎలా ఉన్నానో ఈనాడు అంతే! ఎందుకు?

- ఆలోచిస్తోంటే ఒక కొత్త నీతి తెలిసింది నాకు. అది - రాజకీయంగా, సాంఘికంగా, నైతికంగా కొన్ని నిబంధనలకు లొంగి ఉండేవాడు ఎప్పుడూ పైకిరాడు!! చట్టాలకు, సాంఘిక నియమాలకు బద్ధుడుగా ఉండేవాడు తన జీవితాన్ని చక్రంలో బిగించుకొన్నవాడే అవుతాడనీ తెలిసింది.

అందుకే నేనూ.... ఆ తర్వాతనుంచీ....

- ఆంధ్రప్రభ వారపత్రిక *09.11.1977*